ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం
విశాఖపట్నం కేంద్రం
జాతీయ వార్తలు

తేదీ: 15-10-2024 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

ముఖ్యాంశాలు

-  ప్రాచీన కాలం నుండి భారత దేశం ప్రపంచ శాంతి కోసం కృషి చేస్తోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు.
-  మహారాష్ట్ర, ఝార్ఖండ్ రాష్ట్రాల శాసనసభ ఎన్నికల షెడ్యూల్ ని కేంద్ర ఎన్నికల సంఘం ఈరోజు ప్రకటించింది.
-  ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక పరిజ్ఞాన వినియోగం విషయంలో నిబంధనలను రూపొందించాల్సిన అవసరం ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు.
-  కృత్రిమ మేధస్సు కీలక రంగాలలో సమూలమైన మార్పులకు నాంది పలుకుతుందని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు.
-  భారత విదేశాంగ మంత్రి ఎస్ జై శంకర్ SCO శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు ఇస్లామాబాద్ చేరుకున్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రాచీన కాలం నుండి భారత దేశం ప్రపంచ శాంతి కోసం కృషి చేస్తోందని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. అల్జీరియా పర్యటనలో ఉన్న ద్రౌపది ముర్మును ఈరోజు అల్జీర్స్‌లోని సిడి అబ్దెల్లా సైన్స్ అండ్ టెక్నాలజీ పోల్ యూనివర్సిటీ, పొలిటికల్ సైన్స్‌లో గౌరవ డాక్టరేట్‌తో సత్కరించింది. అల్జీరియా ఉన్నత విద్య శాస్త్రీయ పరిశోధన మంత్రి కమల్ బద్దారి డాక్టరేట్‌ను ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా భారత దేశంలోని ఉన్నత విద్యా రంగం ఎన్నో అవకాశాలు కల్పిస్తోందని రాష్ట్రపతి పేర్కొంటూ..

వాయిస్ బైట్ : రాష్ట్రపతి, ద్రౌపది ముర్ము (వాయిస్ 40 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మహారాష్ట్ర, ఝార్ఖండ్ రాష్ట్రాల శాసనసభ ఎన్నికల షెడ్యూల్ ను కేంద్ర ఎన్నికల సంఘం ఈరోజు ప్రకటించింది. ఢిల్లీలో ఈ రోజు పాత్రికేయుల సమావేశంలో కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ రాజీవ్ కుమార్ మాట్లాడుతూ, మహారాష్ట్రలోని 288 శాసనసభ స్థానాలకు నవంబర్ 20 తేదీన ఒకే దశలో, జార్ఖండ్‌లోని 81 అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 13, 20 తేదీలలో రెండు దశల్లో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. నవంబర్ 23వ తేదీన ఓట్ల లెక్కింపు జరగనుందని ఆయన తెలియజేస్తూ.. (వాయిస్ బైట్.. )

ఈ రాష్ట్రాలతో పాటు వివిధ రాష్ట్రాల్లోని 48 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు రెండు విడతల్లో నిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. (వాయిస్ 32 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (SCO) సదస్సులో పాల్గొనేందుకు విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ఈరోజు మధ్యాహ్నం పాకిస్థాన్ లోని ఇస్లామాబాద్ కు చేరుకున్నారు. పాకిస్థాన్ అధ్యక్షతన రేపు SCO శిఖరాగ్ర సమావేశం జరగనుంది. ఈ పర్యటన బహుపాక్షిక కార్యక్రమం కోసమేనని పాకిస్థాన్ తో ద్వైపాక్షిక చర్చలు ఉండబోవని ఆయన ఇదివరకే స్పష్టం చేశారు. గత తొమ్మిది సంవత్సరాల్లో భారత విదేశాంగ మంత్రి పాకిస్తాన్లో పర్యటించడం ఇదే తొలిసారి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక పరిజ్ఞాన వినియోగం విషయంలో నిబంధనలను రూపొందించాల్సిన అవసరం ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ఈ విషయంలో అంతర్జాతీయ సంస్థలు కలిసి పని చేయాలని పిలుపునిచ్చారు. నాలుగేళ్లకు ఒకసారి జరిగే వరల్డ్ టెలికమ్యూనికేషన్ స్టాండర్డైజేషన్ అసెంబ్లీ-2024ను న్యూ ఢిల్లీలోని భారత మండపంలో ప్రధానమంత్రి ఈ రోజు ప్రారంభించారు. అదే విధంగా దేశీయ ఆవిష్కరణలు ప్రదర్శించేందుకు నిర్వహించే ఇండియన్ మొబైల్ కాంగ్రెస్ 8వ ఎడిషన్‌ను కూడా ఈ కార్యక్రమంలోనే నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, 'భారతదేశంలో 120 కోట్ల మొబైల్ వినియోగదారులు, 95 కోట్ల ఇంటర్నెట్ వినియోగదారులు ఉన్నారని పేర్కొన్నారు. ప్రపంచంలోనే 40 శాతానికి పైగా డిజిటల్ లావాదేవీలు భారతదేశంలో జరుగుతున్నాయని నరేంద్ర మోడీ పేర్కొంటూ..

వాయిస్ బైట్ : ప్రధానమంత్రి నరేంద్ర మోడీ (వాయిస్ 30 సెకన్లు)

==========================

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కేంద్రపాలిత ప్రాంతమైన జమ్మూకశ్మీర్ నూతన ముఖ్యమంత్రిగా ఒమర్ అబ్దుల్లా రేపు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ మేరకు ఒమర్ అబ్దుల్లాను లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఆహ్వానించారు. శ్రీనగర్‌లోని SKICCలో ఉదయం 11.30 గంటలకు ముఖ్యమంత్రి, మంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహిస్తారని రాజ్ భవన్ వర్గాలు తెలిపాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

న్యూ ఢిల్లీలో జరుగుతున్న ISSF వరల్డ్ కప్ 2024 ఫైనల్లో మహిళల 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్లో భారత షూటర్ సోనమ్ ఉత్తమ్ మస్కర్ రజత పతకం సాధించింది. ఈ ఈవెంట్లో చైనా షూటర్ యుటింగ్ హువాంగ్ స్వర్ణ పతకం సాధించగా, ఫ్రెంచ్ షూటర్ ఓషియానే ముల్లర్ కాంస్య పతకం సాధించారు. ఫైనల్లో మరో భారత షూటర్ తిలోత్తమా సేన్ 167.7 పాయింట్లతో ఆరో స్థానంలో నిలిచింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఆంధ్రప్రదేశ్ కృష్ణా జిల్లాలోని నాగాయలంకలో క్షిపణి ప్రయోగ కేంద్రం ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ ప్రాజెక్టుకు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని భద్రతా వ్యవహారాల క్యాబినెట్ కమిటీ (సిసిఎస్) ఇటీవల ఆమోదం తెలిపింది. వ్యూహాత్మక క్షిపణి వ్యవస్థలను పరీక్షించడం, ముఖ్యంగా రక్షణ సామర్థ్యాలను బలోపేతం చేయడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యంగా పేర్కొంది. భూమిపై నుండి గాల్లోకి ప్రయోగించే క్షిపణి వ్యవస్థ, యాంటి ట్యాంక్ క్షిపణులు, వ్యూహాత్మక క్షిపణి వ్యవస్థలను పర్యవేక్షించనున్నామని డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (డిఆర్‌డిఒ) ఒక ప్రకటనలో పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కృత్రిమ మేధ కీలక రంగాలలో సమూలమైన మార్పులకు నాంది పలుకుతుందని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన ఒక కార్యక్రమంలో ఆరోగ్యం, వ్యవసాయం సుస్థిరమైన నగరాలపై దృష్టి సారించేందుకు మూడు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పరిశోధనలు, ఆవిష్కరణలు ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించడంతో పాటు ప్రజా సంక్షేమానికి భరోసా ఇవ్వడంలో ఈ కేంద్రాలు ప్రధాన పాత్ర పోషిస్తాయని ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొంటూ...

వాయిస్ బైట్ : కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ (వాయిస్ 28 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

రానున్న మూడు రోజుల్లో తమిళనాడు, పుదుచ్చేరి కారైకాల్, దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాంలో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (IMD) తెలిపింది. కేరళ, మహే, ఉత్తర కర్ణాటక, లక్షద్వీప్‌లలో ఈ నెల 18వ తేదీ వరకు భారీ వర్షాలు కురుస్తాయని IMD అంచనా వేసింది. మరో వైపు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో తమిళనాడు వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. వరద ప్రాంతాలలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎం కె స్టాలిన్ ఈ రోజు పర్యటించారు. అనంతరం ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారు. వరద ప్రాంతాల్లో తగిన చర్యలు చేపట్టాల్సిందిగా అధికారులను ఆదేశించారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

సమాచార ప్రసార మంత్రిత్వ శాఖలోని ఉద్యోగులందరికీ ఆన్‌లైన్ ద్వారా వివిధ కోర్సులు నేర్చుకోవడానికి ఇంటిగ్రేటెడ్ గవర్నమెంట్ ఆన్ లైన్ ట్రైనింగ్ (IGOT) ల్యాబ్‌ను ఏర్పాటు చేయాలని సమాచార ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్. ఎల్. మురుగన్ అధికారులను ఆదేశించారు. ఢిల్లీలో ఈరోజు సమాచార ప్రసార శాఖ కార్యదర్శి సంజయ్ జాజు, ఇతర సీనియర్ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ ఉద్యోగులందరినీ ఈ నెల 19వ తేదీ నాటికి IGOT పోర్టల్‌లోకి చేర్చాలని కోరారు. ఉద్యోగులు ఆన్ లైన్ ద్వారా శిక్షణ పొందడానికి 16 కోర్సులను ఎంపిక చేశారు. ఉద్యోగుల వృత్తిపరమైన నైపుణ్యాలను మెరుగుపరచడానికి ఈ విధానం ఉపయోగపడుతుందని అధికార వర్గాలు తెలిపాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాలతో ముగిశాయి. సెన్సెక్స్153 పాయింట్లు నష్టపోయి 81,820 వద్ద ముగిసింది. నిఫ్టీ 70 పాయింట్ల నష్టంతో 25,057 వద్ద స్థిరపడింది. ఫారెక్స్ మార్కెట్‌లో ఈరోజు అమెరికా డాలర్‌తో రూపాయి మారకం విలువ 84 రూపాయల మూడు పైసల వద్ద ముగిసింది.

==============================
==============================